# దావీదుతో దేవుని నిబంధన

> **ప్రభువైన** ఇశ్రాయేలు దేవుడు స్తుతింపబడునుగాక ఆయన తన ప్రజలకు దర్శనమిచ్చి, వారికి విమోచన కలుగజేసెను. తన సేవకుడైన దావీదు వంశమునందు మనకొరకు రక్షణ శృంగమున ... ఆయన మన పితరులను కరుణించుటకును తన పరిశుద్ధ నిబంధనను ... జ్ఞాపకము చేసికొనుటకును ... (లూకా 1:68–75).

దేవుడు దావీదుతో చేసిన నిబంధనలో క్రీస్తుచే నెరవేర్చబడే వాగ్దానముంది. తన జీవితపు చివరి భాగంలో, దేవుడు ఈ నిబంధనను తనతో చేసినట్టు దావీదు తెలియజేశాడు (2 సమూ. 23:5). అది 2 దినవృ. 21:7లో ప్రస్తావించబడింది. యూదా దేశపు చరిత్రలో పతనానికి జోగుతున్న కాలంలో యిది వర్ణించబడింది. కీర్తన. 89లో, ఆ నిబంధనను గూర్చి దేవుని యొక్క ప్రతిపాదనలను దావీదు రికార్డు చేశాడు:

> –నేను ఏర్పరచుకొనినవానితో నిబంధన చేసియున్నాను
> నిత్యము నీ సంతానమును స్థిరపరచెదను
> తరతరములకు నీ సింహాసనమును స్థాపించెదనని చెప్పి
> నా సేవకుడైన దావీదుతో ప్రమాణము చేసియున్నాను (3, 4 వ.).
>
> నా కృప నిత్యము అతనికి తోడుగా నుండజేసెదను
> నా నిబంధన అతనితో స్థిరముగా నుండును.
> శాశ్వతకాలమువరకు అతని సంతానమును
> ఆకాశమున్నంతవరకు అతని సింహాసనమును నేను నిలిపెదను (28, 29 వ.).
>
> నా నిబంధనను నేను రద్దుపరచను
> నా పెదవులగుండ బయలువెళ్లిన మాటను మార్చను.
> అతని సంతానము శాశ్వతముగా ఉండుననియు
> అతని సింహాసనము సూర్యుడున్నంత కాలము నా సన్నిధిని ఉండుననియు
> చంద్రుడున్నంత కాలము అది నిలుచుననియు
> మింటనుండు సాక్షి నమ్మకముగా ఉన్నట్లు అది స్థిరపరచబడుననియు ...
> (34–36 వచ.).

నిలిచియుండే రాజ్యాన్ని గూర్చి నాతాను దావీదుకు అభయమిచ్చాడు (2 సమూ. 7:13, 16). దాని ఏలిక బేత్లెహేములోనుండి వస్తాడని మీకా ప్రవచించాడు (మీకా 5:2). ఆరోహణుడైన మనుష్య కుమారుడు శాశ్వత రాజ్యాన్ని పొందడానికి మహా వృద్ధుడగువాని సన్నిధిని ప్రవేశించినట్టు దానియేలు దర్శనంలో చూచాడు (దానియేలు 7:13, 14). దావీదు సింహాసనం మీద ఆసీనుడయ్యే ఏలికను గూర్చి యెషయా కూడా పలికాడు (యెషయా 9:6, 7).

యూదా గోత్రపువాడు దావీదు వంశపువాడునైన యేసు ప్రభువునందు ఈ ప్రవచనాలన్నింటికి నెరవేర్పు కన్పించింది. తన కుమారులను ఆశీర్వదించడంలో, యూదాలోనుండి రాజ దండము తొలిగిపోదని యాకోబు ప్రవచించాడు (ఆది. 49:10). దావీదు దేవుని ప్రజలను ఏలినట్టే, దావీదు సంతతిలోని ఒకడు దేవుని ప్రజలను[1] ఏలుతాడని యితర ప్రవచనాలు సూచిస్తున్నాయి.

ప్రభువైన యేసును గూర్చి మరియకు సమాచారమిచ్చిన గబ్రియేలు దూత ఈ ప్రవచనాలన్నిటిని ఏకం చేసి యిలా అన్నాడు: "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; **ప్రభువైన** దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండును" (లూకా 1:32, 33).

ప్రభువైన యేసు ఆరోహణుడై తండ్రి కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, సమస్తమును ఆయన పాదముల క్రింద[2] పాద పీఠముగా చేయ కూర్చుండ బెట్టబడినప్పుడు యిదంతయు నెరవేర్చబడింది. అప్పటినుండి, క్రీస్తు ప్రభువునకు పరలోకమందును భూమిమీదను సర్వాధికారమియ్యబడింది (మత్తయి 28:18). ఎవరి పాపములైతే క్షమించబడ్డాయో, అంధకార సంబంధమైన సాతాను అధికారంనుండి విడుదల చేయబడి ప్రభువైన యేసు యొక్క రాజ్య నివాసులుగా చేయబడతారు (అపో. 2:38; 26:18; కొలస్సీ. 1:13).

యేసు మెస్సీయా, లేక క్రీస్తు (యోహాను 1:41; అపో. 2:36). ఆయన ఏలుబడి చేస్తున్న కారణాన, ఆయనకు మనం లోబడాలి, లేదా మనం నాశనం చేయబడతాం (అపో. 3:23).

దావీదుతో దేవుడు చేసిన నిబంధన క్రీస్తునందు నెరవేర్చబడింది. ఆయన నిబంధననుసరించి, దావీదు సింహాసనం మీద కూర్చుండి, దేవుని ప్రజలను ఏలడానికి గాను, దేవుడు క్రీస్తును తెచ్చాడు. క్రీస్తును ఈ లోకంలోనికి పంపడంలో దేవుడు దావీదుతో చేసిన నిబంధనను నెరవేర్చాడు.

---

సూచనలు

[1]యిర్మీయా 23:5; 30:9; 33:15; యెహెజ్కేలు 34:23, 24; 37:24, 25; హోషేయ 3:5; జెకర్యా 12:10. [2]మార్కు 16:19; అపో. 2:34, 35; 1 కొరింథీ. 15:27; ఎఫెసీ. 1:19-23; 1 పేతురు 3:22.